ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023 | 5 | పార్వతీపురం మన్యం

96 మంది సిఆర్‌టిలకు రెన్యువల్

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న 193 జిపిఎస్ పాఠశాలల ఎస్‌జిటి సిఆర్‌టి ఉపాధ్యాయులను 96మందిని రెన్యువల్ చేశామని గిరిజన సంక్షేమశాఖ డిడి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక వైటిసిలో రెన్యువల్ ప్రక్రియ నిర్వహించారు. 149 మందికి 96 మందిని రెన్యువల్ చేశారు. 48 మందికి వివిధ కారణాలతో పిఒ దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. రెన్యువల్ కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒ కృష్ణవేణి, సూపరిడెంట్ దేశ్, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, యుటిఎఫ్ నాయకులు పాలక నారాయడు, టీచర్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షులు కొండ గొర్రె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

మన్యానికి మెడికల్ కాలేజీ

- అర్హులందరికీ ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలు
- ఐదు ఐటిడిఎ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు
- వచ్చే నెలలో గిరిజన వర్సిటీకి శంకుస్థాపన
- ఈ ఏడాది నుంచి మెడికల్ కళాశాల అడ్మిషన్లు
- పది రోజులపాటు పండగలా అమ్మఒడి కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /కురుపాం/ గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని, విజయనగరం మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలు సహా రాష్ట్ర వ్యాప్తంగావున్న ఐదు ఐటిడిఎ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జులైలో గిరిజన యూనివర్శిటీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ఆర్‌ఒఎఫ్‌ఆర్ డికెటి పట్టాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అమ్మఒడి కార్యక్రమం పది రోజులపాటు పండగ వాతావరణంలో జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కురుపాం మండలం కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ల్యాబ్‌టాప్‌లో బటన్ నొక్కి నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనులను తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని పనిచేస్తుందని అన్నారు. డిప్యూటీ సిఎం పదవి కూడా గిరిజనులకే కేటాయించామని గుర్తుచేశారు. గిరిజన ప్రాంతంలో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఎక్కడికక్కడ సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో 2600 టవర్లు ఏర్పాటు చేయగా అందులో 118 కురుపాం ఏజెన్సీలో ఉన్నాయన్నారు. గిరిజనులకు సకాలంలో మెరుగైన ఆధునిక వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో ఏజెన్సీ ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతోపాటు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ జిల్లాలోని సింగపురం లో మినీ రిజర్వాయర్ కోసం రూ.38 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి, ఎత్తిపోతల ప్రాజెక్ట్, క్రాసింగ్ నెట్ ప్లాంట్‌ను కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితో పాటు సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరకు డిప్యూటీ సిఎం పదవులు కట్టబెట్టామని గుర్తుచేశారు. మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 3,62,737 ఆర్‌ఒఎఫ్‌ఆర్ డికెటి పట్టాలు మంజూరు చేశామని, పట్టాలు ఇచ్చిన వారందరికీ రైతు బరోసా పథకాన్ని కూడా వర్తింపజేశామని

వివరించారు. ఉద్యోగ కల్పనలోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.30 లక్షల మందికి గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించగా, వారిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 84 శాతం వరకు ఉన్నారని అన్నారు. చంద్రబాబు 14ఏళ్లు సిఎంగా పనిచేసి ఏ ఒక్క సామాజికవర్గానాకి కూడా మేలు చేయలేదని విమర్శించారు. తాము అమలు చేస్తున్న పథకాలకు ఓర్వలేక లేనిపోని అబ్ధాదాలతో ప్రజల్ని మోసం చేస్తున్నారని అన్నారు. ప్యాకేజీ స్టార్ మాదిరిగా తాము తొడలు కొడుతూ చెప్పులు చూపించలేమన్నారు. తమకు ప్రజాపునాదులు ఉన్నాయని, అవి తన పాదయాత్ర నుంచి బలపడుతూ వస్తున్నాయని అన్నారు.

విద్యార్థుల ఇబ్బంది పడకూడదనే అమ్మఒడి : బొత్స

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ డబ్బుల్లేక ఏ విద్యార్థి ఇబ్బందులు పడకూడదని, తమ పిల్లలను బడికి పంపించే తల్లులకు భరోసా కల్పిస్తూ అమ్మఒడి పథకాన్ని రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పదిరోజుల పాటు పండుగ వాతావరణంలో తల్లుల ఖాతాలలో నిధులు జమవుతాయని తెలిపారు. విద్యా రంగంలో మన రాష్ట్రంలో విద్యకు అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల వారు అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నారన్నారు. విద్యారంగంలో డిజిటల్ విధానాన్ని అమలు చేస్తూ బైజూస్ కంటెంట్ తో ట్యాబ్ లు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో ప్రభుత్వ పాఠశాలలలో చదువుకున్న విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థలకు పోటీగా రాష్ట్రస్థాయి ర్యాంకులు, ప్రవేశ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన నాలుగు ప్రోజెక్టులు మంజూరు చేయాలని, గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయరు, గరుగుబిల్లి వద్ద వంతెన, జంఝావతి నదిపై ఉల్లభద్ర వద్ద లిఫ్ట్ ఇరిగేషను ప్రాజెక్టు, జీడి పప్పు ప్రోసెసింగు యూనిట్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

కలెక్టరు నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 85 వేల మంది తల్లులకు రూ.129 కోట్లు అమ్మఒడి నాలుగో విడత నిధులు అందజేస్తున్నట్లు తెలిపారు. నాడు- నేడు కార్యక్రమం మొదటి విడతలో 486 పాఠశాలల్లో రూ.111 కోట్లుతో పనులు పూర్తిచేశామని, రెండో విడత 545 పాఠశాలల్లో రూ.145 కోట్లతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 10వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్మీడియెట్ విద్య కమిషనరు సౌరభ్‌గౌర్, పాఠశాల మౌలిక వసతులు కమిషనరు కె.భాస్కర్, జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెలు విశ్వసరాయి కళావతి, అలజంగి జోగారావు, ఎస్.చినవెంకట అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, టిడ్కో చెర్మన్ జె. ప్రసన్నకుమార్, ఐటిడిఎ ప్రోజెక్టు అధికార్లు సి.విష్ణు చరణ్, కల్పనా కుమారి, పాలకొండ సబ్ కలెక్టరు నూరుల్ కమర్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

హెలీపాడ్ నుండి సభావేదిక వద్దకు వచ్చే మార్గంలో ముఖ్య మంత్రికి ప్రజలు పూలతో స్వాగతం పలికారు. రోడ్ షోలో సిఎంకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ళు, సవర, కోలాట నత్యం, సిరంతాన్ నృత్యం, సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన రేలారేలారే, ధింసా నృత్యం,శివశ్రీ నత్య నికేతన్ వారి నాట్య కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన సిఎం

కార్యక్రమానికి ముందుగా ముఖ్యమంత్రి లబ్దిదారులతో ఫోటో దిగిన అనంతరం, జిల్లాకు సాధించిన అవార్డులు, ప్రగతిపై ఏర్పాటుచేసిన ఫోటోఎగ్జిబిషన్‌ను తిలకించారు. జాతీయ ఉత్తమపంచాయతీ అవార్డు 2023, పదవ తరగతి ఉత్తీర్ణత ఫలితాలు, ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో నీతి ఆయోగ్ మొదటి స్థానం, సాలూరు మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షన్ 2022, ఆయుష్మాన్ ఉత్కృష్ట పురస్కార్-2022 అవార్డులు, మారుమూల ప్రాంతాలకు మొబైల్ కనెక్టివిటీ, ఆర్‌ఒఎఫ్ ఆర్ భూముల అభివృద్ధి గురించి జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు.

18మందికి చెక్కులు పంపిణీ

ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి అర్జీలు సమర్పించిన 18 మందికి సిఎం వెంటనే నిధులు మంజూరు చేశారు. వెంటనే రూ.4 లక్షల విలువ గల చెక్కులను ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ అందజేశారు. మిగిలిన వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు.

సిఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హెలీపాడ్ వద్ద జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీపాడ్‌కు ఆయన చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ఉన్నారు. ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, విజయనగరం జిల్లా పరిషత్ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పార్లమెంటు సభ్యులు జి.మాధవి, బెల్లాన చంద్ర శేఖర్, రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు పి.పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, శంబంగి చినప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, జిసిసి చైర్మన్ స్వాతిరాణి, డిప్యూటీ మేయర్ కె. శ్రావణి, మాజీ ఎంపి, ఎమ్మెల్యే డివిజి శంకరరావు, పాలవలస రాజశేఖర్, హైమావతి, జయమణి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

సమస్యలపై సిఎంకు వినతి

ప్రజాశక్తి కురుపాం /గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతంలో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించాలని, పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానం వెనక్కి తీసుకోవాలని, రైతుల ప్రాణాలు తీసి, పంటలను నష్టపరుస్తున్న అడవి ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించి, రైతులకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు భూములిచ్చిన టేకరుఖండి, చంద్రశేఖర్ రాజపురం గిరిజనులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, గిరిజన ప్రాంతంలో అనేక గ్రామాలకు రోడ్లు వేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇద్దరు వైద్యులను చొప్పున నియమించాలని, పూర్తిస్థాయిలో సిబ్బంది, మందులు ఉంచాలని, గిరిజన గురుకులాల్లో విద్యార్థుల సీట్ల సంఖ్య పెంచాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని, కురుపాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని, గుమ్మిడిగెడ్డ, ఇతర గెడ్డలపై రిజర్వాయర్‌లో చెక్ డ్యామ్‌లో నిర్మించాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

సిఎం సభకు భారీ జన సమీకరణ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం/కురుపాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కురుపాం బహిరంగ సభకు వైసిపి నాయకులు, అధికారులు భారీగా జన సమీకరణ చేశారు. కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లోని మారుమూల గిరిజన గ్రామాల నుంచి సైతం బస్సులను తరలించి సీఎం సభకు భారీ జన సమీకరణ చేశారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం విశేషం. బుధవారం ఉదయం చిన్నపాటి వర్షం కురిసి ఆగిపోవడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సిఎం సభ విజయవంతమైంది. సభకు తీసుకొచ్చిన వారిని తిరిగి తమ గ్రామాలకు సురక్షితంగా పంపించారు. 2,300 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

అందరి నోట బస్సులు లేవు మాట

వీరఘట్టం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం పర్యటనలో భాగంగా ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అందరి నోటా బస్సు రాలేదన్న మాటే వినిపిస్తుంది. బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఆటోలో స్వగ్రామాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్‌ఎన్ మూర్తి అన్నారు. జి - 20 ఈవెంట్స్ లో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు జిల్లా లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత ప్రేరణకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్విజ్ పోటీల విజేతలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థి దశ నుంచి ఆర్థిక అక్షరాస్యత, క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. 13 మండలాల టీమ్‌లకు ఈ నెల 21న నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీమ్ జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

నాయకుల అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి - పార్వతీపురం

అరెస్టయిన గిరిజన సంఘం నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్‌కు వినతిపత్రం ఇస్తామన్నా గిరిజన సంఘం, సిఐటియు నాయకుల అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు, ఉపాధ్యక్షులు కె. రామస్వామి, నాయకులు లక్ష్మణరావు, సన్యాసిరావు, శ్రీనివాసరావు తదితరులు తీవ్రంగా ఖండించారు. కురుపాంలో అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభించడానికి వస్తున్నారని తెలిసి గిరిజనులు, జిల్లా ప్రజల ఎదుర్కొని బోయ వాల్మీకులు, ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానాన్ని రద్దు చేయాలని, జీవో3ను అమలు చేయాలని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఏనుగుల్ని అడవికైనా, జూకైనా తరలించాలని, పూర్ణపాడు- లాబేసు వంతెన పనులు పూర్తి చేయాలని జిల్లా ప్రజల సమస్యల పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం ఎస్పీని ఐదు రోజుల క్రితం కలిసి వినతి పత్రం ఇస్తాం, అనుమతించండని కోరగా ముందు అనుమతి లేదని గిరిజనులను, ప్రజలను కదిలిస్తామని పత్రికా ప్రకటనలు ఇవ్వగా నాయకత్వం వచ్చి వినతిపత్రం ఇవ్వండి అనుమతించారని అన్నారు. దీనికి కట్టుబడి గిరిజన సంఘం, పార్టీ ఇద్దరు నాయకులు రావాలని, వినతి ఇవ్వాలని కోరడంతో నాయకులు హాజరయ్యారన్నారు. అయితే కొమరాడ మండలంలో పోలీసులు అత్యుత్సాహంతో ప్రజాతంత్ర హక్కులకు భంగం కలిగించేలా గిరిజన సంఘం, సిఐటియు నాయకులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాసరావు, కొల్లి సాంబమూర్తి, సీతారాం, మల్లేశను వేకువజామున ఇళ్లకు వెళ్లి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బందించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతి భద్రతల పేరుతో ప్రజా పోరాటాలు చేసే నాయకుల్ని అక్రమంగా నిర్బంధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని దీన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు.

జిసిసి ద్వారా రూ.64 కోట్ల లావాదేవీలు

ప్రజాశక్తి - సీతంపేట

సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి మేనేజర్ సంధ్యారాణి

గిరిజన సహకార సంస్థ ద్వారా సీతంపేట డివిజనల్ కార్యాలయం నుండి ఏడాది రూ.64 కోట్లు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు జిసిసి మేనేజర్ జి.సంధ్యారాణి తెలిపారు. బుధవారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. గత ఏడాది సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు, నిత్యవసర సరుకులు విక్రయాలకు రూ.40 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, రూ. 55 కోట్లు వరకు లక్ష్యాన్ని దాటామని చెప్పారు. ఈ ఏడాది లక్ష కొండ చీపుర్లు కొనుగోలు చేశామని, గత ఏడాది వంద క్వింటాళ్ల కుంకుడు కాయలు, ఈ ఏడాది 500 క్వింటాలు కుంకుడుకాయలు కొనుగోలు చేశామని అన్నారు. 300 క్వింటాలు చింతపండు కొనుగోలు చేశామన్నారు. నిత్యవసర సరుకులు ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ కూడా చేశామన్నారు. పిఒ ఆదేశాల మేరకు ఆధార్ రిఫైండ్ ఆయిల్ పంపిణీ చేస్తున్నమని, బ్రాండెడ్ కందిపప్పు, మినపప్పు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎంఎస్‌డిసి ద్వారా టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిసిసి అటవీ ఉత్పత్తులు ఆన్లైన్ ద్వారా అమ్మకాలు జరుపుతున్నామని చెప్పారు. ఈ ఏడాది ఏడు కోట్ల 30 లక్షలు ఉత్పత్తులు లక్ష్యం కాగా, రూ.8 కోట్ల 8 లక్షలు అయ్యామని అన్నారు. పాతపట్నం బ్రాంచ్ ద్వారా రూ.పది లక్షల వరకు రుణాలు ఇచ్చామని, అవి కూడా రికవరీ చేశామని చెప్పారు. సీతంపేట బ్రాంచ్ ద్వారా నాలుగు లక్షల రుణాలు లబ్ధిదారులకు పంపిణీ చేయగా 2.7 లక్షలు రికవరీ చేశామని తెలిపారు. రెండు బ్రాంచ్ ద్వారా 55 డిపోలు నిర్వహిస్తున్నామని, డిపో మరమ్మతులకు, నూతన భవనాలకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. రూ.48లక్షలతో డివిజనల్ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. సమావేశంలో సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, జి.నరసింహులు ఉన్నారు.

పెంచిన విద్యుత్తు ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉప సంహరించు కోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కంది త్రినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కై విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచి ప్రజలపై రూ.1400 కోట్ల భారం మోపుతున్నాయని అన్నారు. గతంలో ఏడాదికో, రెండేళ్లకో విద్యుత్ ఛార్జీలు పెంచేవారని, ఇప్పుడు మరి దారుణంగా ప్రతి నెల విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటివరకు కరెంట్ బిల్లు చెల్లించినా, సర్దుబాటు ఛార్జీలు పేరుతో రూ.6వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని అన్నారు. ఏప్రిల్‌లో యూనిట్‌కి 80 పైసలు చొప్పున పెంచారని అన్నారు. ట్రూ ఆప్ ఛార్జీల పేరుతో ఈ విధంగా కరెంటు చార్జీలను అమాంతంగా పెంచి ప్రజలపై భారాలు వేస్తే పేద ప్రజలకు దీపంబుడ్డీల గతి అన్నారు. సాయి అమృతా రెసిడెన్సీ కార్యదర్శి యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ 1999లోనే విద్యుత్ సంస్కరణలను కేంద్రలోని వాజ్‌పాయి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. నేడు మోడీ ప్రభుత్వం ఆ విధానాలను వేగంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఛాంబర్ అఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ వి. సతీష్ మాట్లాడుతూ రాబోయే కాలంలో స్మార్ట్ మీటర్లు తెస్తారని, వాటిని ఇప్పటినుండే తిప్పికొట్టాలని అన్నారు. అయ్యప్పనగర్ కాలనీ కార్యదర్శి సుదీర్ మాట్లాడుతూ సర్ ఛార్జీలు, సర్దు బాటు ఛార్జీల పేరుతో పెంపు జరుగుతోందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ మాట్లాడుతూ దళితులకు ఇచ్చే విద్యుత్తు సబ్సిడీని ఎత్తివేస్తున్నారని తెలిపారు. రజక సంఘం జిల్లా నాయకులు భాస్కరరావు.చిన్నా, నాలుగువతరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్, ఐద్వా జిల్లాకార్యదర్శి పి. రమణమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్. ఎల్ బి జి నగర్ కార్యదర్శి బి.రమణ, సిఐటియు నాయకులు జగన్మోహన్, గురజాడ నగర్ నాయకులు వెంకటరావు, ఐద్వా జిల్లా నాయకులు వి. లక్ష్మీ, తది తరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వైద్యసేవలపై రాజన్న సంతృప్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వైద్యం చేయించుకుని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సమావేశం అనంతరం పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల మంత్రి బైక్ ర్యాలీలో పాల్గొన్నప్పుడు జరిగిన ప్రమాదంలో కాలి బోటన వేలికి తీవ్ర గాయం అవ్వడంతో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అలాగే ఇటీవలనే కళ్లకు సైతం శస్త్ర చికిత్స చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా మంత్రి గతంలో శస్త్ర చికిత్స చేయించుకున్న కాలు, కళ్లను మరోసారి వైద్యులచే పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని గూర్చి తెలుసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులు తీసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో గతంలో కంటే ప్రస్తుతం పూర్తి స్థాయిలో మెరుగుపడడమే కాకుండా అన్ని రకాల వైద్య సేవలను అందిస్తుందన్నారు. ఇదే ఆసుపత్రి త్వరలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చెందడమే కాకుండా వైద్య కళాశాలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, వైద్యాధికారులు, వైద్యులు, వైసీపీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులువెంట పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

'పోలవరం పోరుకేక'కు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పాచిపెంట

పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ పాచిపెంట మండల కేంద్రంలో సిఐటియు, ఐద్వా నాయకులు బుధవారం విరాళాలు సేకరించారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, శ్రామిక మహిళా టి.ప్రభావతి, ఐద్వా ప్రతినిధి పి.సత్తమ్మ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రజలంతా పార్టీలకతీతంగా నిర్వాసితుల పోరాటానికి అండగా నిలిచి, వారికోసం పోరాడుతున్న సిపిఎంకు సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా కోరారు

దుర్గపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని దుర్గపేట వీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుజాతి కీర్తి పతాక పివి

ప్రజాశక్తి - సాలూరు

ప్రపంచానికి తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు చాటి చెప్పిన మహానుభావుడు పివి నరసింహారావు అని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ చెప్పారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి భీసెట్టి బాబ్జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన పివి నరసింహారావు రాష్ట్రంలో భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రపంచ దేశాల్లో ఆర్థిక సంస్కరణల పితామహుడిగా కీర్తి గడించిన పి వి నరసింహారావు తెలుగు జాతికి గర్వకారణమని అన్నారు. మాతృభూమి సేవా సంఘం జిల్లా కార్యదర్శి పి.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందజేయడానికి రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాతభూమి సేవా సంఘం అధ్యక్షుడు గోపాలరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఇఇ గోపాలకృష్ణమూర్తి

విద్యుత్తుశాఖ సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఇఇ గోపాలకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఐటిడిఎలో బుధవారం సీతంపేట, కొత్తూరు, ఎల్ఎన్ పేటకు చెందిన భామిని, పాలకొండ మండలాల విద్యుత్ శాఖ సిబ్బందితో నేషనల్ ఎలక్ట్రికల్ సేఫ్టీ వీక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై రెండు వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిఇ తిరుమలరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది అప్రమత్తంతో ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. గ్రామాల్లో కూడా అవగాహన కల్పించాలన్నారు. గాలులు, వానలు పడేటప్పుడు వైర్లు తెగినప్పుడు గుర్తించాలన్నారు. సమావేశంలో స్థానిక ఎఇ నీలిమ, మిగిలిన మండలాల విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు పనిచేయనున్న విద్యుత్తు బిల్లుల కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని గల అన్ని విద్యుత్ రెవిన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు గురు వారం సెలవు రోజుకూడా పనిచేస్తాయని విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్ రెవిన్యూ కార్యాలయలతో పాటు, ఎపిఇపిడిసియల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఎటిపి సెంటర్ లలో కూడా ఈ ఆదివారం కూడా చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమిలో గిరిజన మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన భూదేవి గిరిజన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - బొబ్బిలి

క్రీడలతో మానసికొల్లాసం లభిస్తుందని డిఎస్‌పి పి.శ్రీధర్ అన్నారు. ఈనెల 26న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో నవతేజనాయుడు గోల్డ్ మెడల్ సాధించగా సూర్యశశాంక్, గీతిక, శ్రీవల్లి, గ్రీష్మ, సృజన, శృతి సిల్వర్ మెడల్, లోకేష్, హేమంత్, వంశీ, చరణ్, శ్రీకర్ బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుధాకర్ చెప్పారు. వీరిని డిఎస్‌పి శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు పి.రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30న విజయవాడలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం పిలుపునిచ్చారు. ధర్నా గోడపత్రికలను బుధవారం ఎం.బూర్జవలసలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి రైతులు సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతుందన్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్నా గిట్టుబాటు ధరలు పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పంటల బీమా ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాను రైతులు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు జి.అప్పల నాయుడు, జి.స్వామినాయుడు, టి.సత్యం, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రైతాంగ సమస్యల పరిష్కారానికి జూన్ 30న విజయవాడలో జరిగే మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ పట్టణంలోని కర్ణాటక కల్లాల వద్ద రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ పంటల బీమా వెంటనే విడుదల చేయాలన్నారు. రైతు తన వ్యవసాయానికి అయిన ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి కనీసం మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన సమస్యలపై నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. జగ్గారావు, సిహెచ్ జగ్గారావు, కే సత్యవమ్మ, పి సన్నాసమ్మ, వై నాయుడు, రమణమ్మ, వెంకటలక్ష్మి, సిహెచ్ సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజన్నదొర

వైఎస్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ముఖ్యమంత్రి

చిన్నారులతో ముచ్చటిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

సిఎం సభా దృశ్యమాలిక

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి జగన్

సిఎంకు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

బాధితులకు సిఎం చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

జగన్నాధుడ్ని దర్శించుకుంటున్న మహిళలు

ఘనంగా మారు రథయాత్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మారు రథయాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్‌నగరం, అడ్డాపుశిలలో నిర్వహించిన ఉత్సవాలకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని మారు రథయాత్ర ఉత్సవాలు బుధవారంతో ఘనంగా జరిగాయి. ఈనెల 20న మందిరం వీధిలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న గుండిష మందిరం వద్దకు జగన్నాధు, బలబద్ర సుభద్రలను రథంపై తరలించారు. మారు రథయాత్రలో భాగంగా గుండుస మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బలబద్ర సుభద్ర జగన్నాధుల్ని రథంపై ఎక్కించి ప్రధాన రహదారి మీదుగా మందిరం వీధిలో ఉన్న జగన్నాథ్ ఆలయం వద్దకు తరలించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి లింగరాజురథో, గ్రామ పెద్దలు జామి లక్ష్మీనారాయణ, బూరాడ లక్ష్మీనారాయణ, ఏ రవి, తదితరులు పాల్గొన్నారు.

రద్దీగా బ్యాంకులు

- నగదు విత్ డ్రాకు జనం బారులు
- గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలోని బ్యాంకులు జనాలతో తీవ్ర రద్దీగా ఉంటున్నాయి. పలు సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం చెల్లిస్తున్న నగదు సహాయం అందుకోవడానికి ఖాతాదారులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. ఏజెన్సీలోని మండల కేంద్రాల్లోనే పలు బ్యాంకుల బ్రాంచీలు ఉన్నాయి. దీంతో మారుమూల గ్రామాల నుంచి గిరిజన లబ్ధిదారులు భారీగా బ్యాంకులకు వస్తున్నారు. ప్రస్తుతం రైతుభరోసా కింద ప్రభుత్వం ఇస్తున్న నగదు చెల్లింపులను తీసుకునేందుకు వస్తున్న రైతులతో బ్యాంకులన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. తరచూ అమ్మఒడితో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద నగదు తీసుకోవడానికి వస్తున్న లబ్ధిదారులతో బ్యాంకులన్నీ నిత్యం రద్దీగా కనిపిస్తున్నాయి. అధిక సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకులకు వస్తున్న పరిస్థితి వల్ల కనీస సౌకర్యాలు కానరాని పరిస్థితి ఉంటుంది. బ్యాంకులకు తాము వచ్చిన పనులు పూర్తి చేసుకోవడానికి ఖాతాదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ఇక కురుపాం స్టేట్ బ్యాంకుకు బుధవారం ఏజెన్సీలోని చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన లబ్ధిదారులకు 10 గంటలైనా బ్యాంక్ గేటు తెరవకపోవడంతో బయట సరైన వసతి సౌకర్యాలు లేక పోవటంతో బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు తమ పనుల కోసం బ్యాంకుల ముందు మండుటెండలోనే బారులు తీరినిల్చొవల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులు చేసుకునే అబ్దిదారులు, ఇతర వ్యవసాయ పథకాల లబ్దిదారులు, మహిళలు సైతం తమ ఆర్థిక అవసరాల నిమిత్తం బ్యాంకులకు నిత్యం వస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలతో తమ గ్రామాల నుంచి బ్యాంకులకు వెళ్లి ఒక్కొక్కసారి నెట్ కనెక్టివిటీ లేకపోవడం, సర్వర్ డౌన్ వంటి సాంకేతిక సమస్యల కారణంగా బ్యాంకుల్లో చెల్లింపులు జరగక వెనుతిరగాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కసారి పేమెంట్లు కూడా పూర్తిస్థాయిలో జరగడం లేదని అంటున్నారు. ఈ వేసవిలో మండుటెండలో బ్యాంకుల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటి కైన జిల్లా ఉన్నతాధికారుల స్పందించి బ్యాంకుల్లో కనీసం కూర్చోవడానికి బెంచీలు తాగడానికి మంచి నీళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులు, బ్యాంకుల ఖాతాదారులు కొరుతున్నారు.

స్టేట్‌బ్యాంకు వద్ద బారులు తీరిన ఖాతాదారులు

ఆదరణేది జగన్నాథా?

ప్రజాశక్తి-పాలకొండ

ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పాలకొండలో జరుగుతున్న జగన్నాథస్వామి ఉత్సవాలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. ఎంతో ప్రసిద్ధి గాంచిన జగన్నాథస్వామి ఆలయ ఉత్సవాలు తూతూ మంత్రంగా జరగడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. దేవాదాయశాఖాధికారులు, సిబ్బంది జాడ కరువవ్వడంతో వచ్చిన యాత్రికులు సమస్యలను ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఎంతో వైభవంగా జరగాల్సిన జగన్నాథస్వామి ఉత్సవాలు పేలవంగా జరగడంతో ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదాయమే తప్పా అభివృద్ధి లేదు...

ఉత్సవాల్లో దేవాదాయశాఖాధికారులు ఆదాయానికి చూసుకుంటున్నారే తప్పా అభివృద్ధిపై దృష్టిపెట్టడం లేదు. ముఖ్యంగా జెయింట్ వీల్ ఏర్పాటుకు రూ.4 లక్షలకు ఒక వ్యక్తికి ఖరారు చేశారు. అదే విధంగా దేవాదాయశాఖాధికారులకు అనధికారికంగా మరో రూ.50వేలు ముట్టజెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జెయింట్ వీల్ టిక్కెట్లు భారీగా ధరలు పెంచి ఇష్టానుసారంగా వ్యాపారి వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జెయింట్ వీల్ ఏర్పాటు చేయాలంటే భద్రతపై దృష్టిపెట్టి పరికరాలను పరిశీలించి సంబంధిత అధికారులు ఆమోదం తెలిపిన తరువాతే అనుమతి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ దేవాదాయశాఖాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనుమతులిచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో యాత్రకు వచ్చిన ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట మలమూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. కనీసం తాత్కాలికంగా కూడా ఏర్పాట్లు చేయకపోవడంతో పాలకొండతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

యాత్ర సమయంలోనూ కానరాని సిబ్బంది
అసౌకర్యాల నడుమ కొనసాగుతున్న యాత్ర

జగన్నాథస్వామి ఆలయం

సర్వేల పేరుతో పికె టీమ్ వసూళ్లు!

వైసిపి నాయకుల ఆందోళన

ప్రజాశక్తి- డెంకాడ

రాబోయే 2024 ఎన్నికలకు వైసిపి వివిధ రకాల టీమ్‌ల పేర్లు చెప్పి గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల వల్ల గ్రామాల్లో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని వైసిపి నాయకులు చెబుతున్నారు. మండలంలో సుమారు అన్ని గ్రామాల్లో పీకే టీమ్, ఐప్యాక్ టీమ్ ఇలా వివిధ రకాల టీమ్‌లు పేర్లు చెప్పి సర్వేలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న వైసిపి నాయకులను కలిసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది. కొంత మంది తమ ఎకౌంట్లో డబ్బులు వేయమంటున్నారు. భోజనాలు కూడా పెట్టమంటున్నారు. ఇద్దరు ముగ్గురు భోజనాల కోసం పది మందికి నాయకుల వద్ద వసూలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా చేస్తే మీ గ్రామాల్లో పరిస్థితి వైసిపికి అనుకూలంగా సర్వే చేస్తామని లేకపోతే మీ గ్రామాల్లో వైసిపి పరిస్థితి బాగోలేదని నాయకుల పరిస్థితి అధ్వానంగా ఉందని సర్వే రిపోర్టు ఇస్తామని రకరకాలుగా నాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో నాయకులు వైసిపి సర్వే టీమ్‌ల పేర్లు చెప్పగానే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇవేమి టీమ్‌లురా బాబోయ్ అని గగ్గోలు పెడుతున్నారు. మండలంలో పది రోజుల క్రితం సింగవరం, నాతవలస గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో వివిధ రకాల టీమ్‌లు సర్వేలు నిర్వహించాయి. అయితే ఆ గ్రామాల్లో నాయకుల వద్ద కొంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. ఇలా సర్వేల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేయడం ఏంటని నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సర్వేలు చేస్తున్న టీములపై అధినాయకులు దృష్టి సారించాలని మండల వైసిపి నాయకులు కోరుతున్నారు.

విద్యుత్తు భారాలపై 30న ధర్నా

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలిప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ముప్పుపై ఈ నెల 30న బొబ్బిలి డిఇ ఆఫీస్ ముందు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం వామపక్ష నాయకులు మీడియాతో మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలలో భాగంగా విద్యుత్తు పంపిణీ అంతా ఆదానికి కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫిక్స్‌డ్, కస్టమర్, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేసి కరెంటు చార్జీలు పెంచుతున్నారన్నారు. దీనివల్ల అన్ని రకాల వస్తువు ధరలు పెరుగుతాయని, ఫెర్రోఎల్లాస్ కంపెనీ లాంటివి జులై 15 నుండి మూసివేస్తున్నామని యాజమాన్యాలు ప్రకటించాయని గుర్తు చేశారు. దీని వల్ల వేలాదిమంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. దీనికి తోడు స్మార్ట్ మీటర్ల ప్రమాదం ప్రజలపై పడబోతుందని ముందుగా డబ్బులు చెల్లించే రీఛార్జి విధానం రాబోతుందని తెలిపారు. ఈ దుర్మార్గమైన విద్యుత్తు బారాలకు వ్యతిరేకంగా జూన్ 30 ఉదయం10 గంటలకు బొబ్బిలి కోట చెరువు దరి ఎలక్ట్రికల్ డిఇ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు వి. కృష్ణ, పీకేఎస్ జిల్లా నాయకులు టి. అప్పలనాయుడు, సిపిఎం బొబ్బిలి మండల కార్యదర్శి ఎస్ గోపాల్, బూర్జవలస సిపిఎం కార్యదర్శి జి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఈ నెల 30న స్థానిక సబ్ స్టేషన్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. బుధవారం నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసనగా అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచి వినియోగ దారులపై భారంమోపడం దారుణమన్నారు. గతంలో 300, 500 బిల్లులు వచ్చిన వారికి 1000 నుంచి 2000 రూపాయల వరకు విద్యుత్ బిల్లులు రావడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మొయిద పాపారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కాళ్ల అప్పలసూరి, టిడిపి నాయకులు బొలే కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు' పనులకు రూ.33 కోట్లు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఇప్పటి వరకు జిల్లాలో రూ.33.3 కోట్లతో గడప గడప పనులు మంజూరు అయ్యాయని పంచాతీ రాజ్ ఎస్ఇ గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక మండలం పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గం స్థాయి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, ఆర్బికె లు సెప్టెంబర్ నాటికి పూర్తి చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు.

530 సచివాలయాలు

జిల్లాలో 530 సచివాలయాలు, 496 ఆర్బికెలు, 435 వెల్ నెస్ సెంటర్లుకు గాను రూ.194 కోట్లుతో పనులు చేపడుతున్నా మని తెలిపారు. సచివాలయాలు 530కి గాను 379, 496 ఆర్బికె లకు గాను 275, 435వెల్ నెస్ సెంటర్‌లకు గాను 179 పూర్తయ్యాయన్నారు. వీటికి రూ. 89 కోట్లు బిల్లులు చెల్లించామని ఆయన అన్నారు. ఇంకా రూ. 5 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ ఢీ కొని లారీ క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి - రామభద్రపురం

జాతీయ రహదారి ఆరికతోట ధాబా వద్ద గ్యాస్ ట్యాంకర్ లారీ ఢీ కొని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన క్లీనర్ దినేష్ (45) మృతి చెందాడు. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. గ్యాస్ లోడ్‌తో విశాఖకు వెళుతూ విశ్రాంతి కోసం ధాభా వద్ద టాంకర్‌ను నిలుపు చేసే క్రమంలో డ్రైవర్‌కు డైరెక్షన్ చెబుతున్నాడు. డ్రైవర్ సరిగా గమనించకుండా వెనుకకి మళ్ళించే ప్రయత్నంలో దినేష్ యాదవ్ ను వెనుక భాగం ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటనను గమనించి స్థానికులు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకుల సీతంపేట గ్రామంలో ఏ విధమైన అనుమతులూ లేకుండా అక్రమంగా మద్యం అమ్ముతున్న మజ్జి కనక మహాలక్ష్మిని బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆమె వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడిలో మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- 5న విశాఖలో ప్రాంతీయ సదస్సు
- సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతై జులై 5న విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సులో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఎల్‌బిజి భవన్ సిఐటియు కార్యాలయంలో కె.రామచంద్ర రావు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజయనగరం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 010 పద్దు ద్వారా జీతాలు, సమాన పనికి సమాన వేతనం, రిటైర్ అయిన మరణించిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, విలీన ప్రాంత కార్మికులను కార్పొరేషన్ కార్మికులురగా గుర్తించాలని, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు జీవో నెంబర్ 30 సవరించి టెక్నికల్ వేతనాలు చెల్లించాలని , క్లాప్ వాహన డ్రైవర్లకు రూ.18500 చెల్లించాలని తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో నిర్వహించే సదస్సుకు ముఖ్య వక్తగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా జిల్లా కార్యదర్శి జగన్మోహన్ రావు, విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల నుంచి వచ్చిన కార్మిక సంఘం నాయకులు, బాబురావు, రాజేష్, గౌరీ, రామారావు రామా నాయుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.